సాక్షి
నిర్మల్
శనివారం : 24 : ఫిబ్రవరి : 2024



రీలొకేషన్ ఎప్పుడో?
కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ కోర్ ఏరియాలోని రాంపూర్, మైసంపేట్ గ్రామాల తరలింపు ప్రక్రియ తుది దశకు చేరింది. కొత్త మద్దిపడగ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న విలేజ్ రీలొకేషన్-1కు తరలించనున్నారు. 8లో▸



బస్టాండ్‌లో సౌకర్యాలేవి?
నియోజకవర్గ కేంద్రమైన ఖానాపూర్‌లో బస్టాండ్ సమస్యలకు నిలయంగా మారింది. పేరుకు మున్సిపాలిటీ అయినప్పటికీ బస్టాండ్‌లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. 9లో▸

గరిష్టం/కనిష్టం
33.3 /21.4

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. మధ్యాహ్నం వేడిగా ఉంటుంది. తెల్లవారుజామున చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న సమ్మక్క సారలమ్మ జాతర



సమ్మక్క గద్దెపై పూజలు చేస్తున్న భక్తులు

ముధోల్: మండలంలోని ఎడ్‌బిడ్‌తండా గ్రామంలో సమ్మక్క సారలమ్మ జాతర ఘనంగా కొనసాగుతోంది. శుక్రవారం భక్తులు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి కోరికలు తీరినవారు నిలువెత్తు బంగారాన్ని(బెల్లం) సమర్పించారు. శనివారం జాతర ముగియనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వైద్య ఆరోగ్య ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సంఘం ఐఎన్‌టీయూసీ-3194 డైరీ, క్యాలెండర్‌ను డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్ శుక్రవారం ఆవిష్కరించారు. వైద్యారోగ్య ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణమోహన్‌గౌడ్, కార్యదర్శి కన్నయ్య, నాయకులు భోజారెడ్డి, రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, రమణారెడ్డి, సురేశ్‌రెడ్డి, పురుషోత్తం, శాంత, ఉమారాణి, సుమతి, నుస్రత్, శోభ, సునీత, గంగ, మురళి, రమణ, కార్యాలయ సూపరింటెండెంట్ పురుషోత్తం, సంతోష్, శేషు, మహేందర్ పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో నిర్మల్ క్రీడాకారులకు పతకాలు



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

నిర్మల్‌టౌన్: రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో నిర్మల్ విద్యార్థులు సత్తా చాటి పతకాలు గెలుచుకున్నారు. ఈనెల 21 నుంచి 23 వరకు హైదరాబాద్‌లోని లాలాగూడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో కె.నందిని(33-35 కేజీల విభాగం), కీర్తన(46-49 కేజీల విభాగం), శ్రుతి(42-43 కేజీల విభాగం), సీహెచ్.అశ్విత (40-43 కేజీల విభాగం), సుజల(52-53 కేజీల విభాగం)లో కాంస్య పతకాలు సాధించారు. క్రీడాకారులను బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ శ్రీధర్, సెక్రెటరీ చందుల స్వామి, రాష్ట్ర బాక్సింగ్ సెక్రటరీ రవీందర్, జిల్లా క్రీడల అధికారి నస్పేఖాన్ అభినందించారు.

జాతీయ ఫిజీషియన్ కాన్ఫరెన్స్‌కు జిల్లా వైద్యులు

నిర్మల్‌చైన్‌గేట్: ఢిల్లీలో ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించే అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్ ఆఫ్ ఇండియా నేషనల్ కాన్ఫరెన్స్ జాతీయ 79వ వార్షికోత్సవానికి నిర్మల్ చాప్టర్ అధ్యక్షుడు డాక్టర్ దామెర రాములు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతపండు రవికుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో అధునాతన ఔషధాలు, వైద్యంలో అధునాతన మెలకువల గురించి చర్చించినట్లు తెలిపారు.

కడెం.. వెలవెల



అడుగంటిన కడెం ప్రాజెక్ట్ నీటిమట్టం

కడెం: ఉమ్మడి జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్ట్ కడెం. గతుదాది ప్రాజెక్ట్ మరమ్మతులు లేక, వానాకాలం చివరిలో వర్షాలు లేక, ప్రాజెక్ట్‌లోని నీటిమట్టం క్రమంగా తగ్గిపోయింది. ఏటా యాసంగిలో కడెం ఎడమ కాలువ ద్వారా యాసంగిలో సుమారు 20 వేల ఎకరాలు సాగు నీరందుతుండగా, కుడి కాలువ ద్వారా పది వేల ఎకరాలకు సాగు నీరందేది. ఈ ఏడాది సమృద్ధిగా నీరు లేక కనీసం కుడి కాలువకు సైతం నీరందించడం లేదు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, గతేడాది ఫిబ్రవరి 23న, ప్రాజెక్ట్ నీటిమట్టం 688.675 అడుగులు ఉంది. ఈఏడాది 677.800 అడుగులకు పడిపోయింది.



నీరు లేక వెలవెలబోతున్న కడెం కుడి కాలువ



బాసర ట్రిపుల్ ఐటీ

జైలా.. వర్సిటీనా?

- బాసర ట్రిపుల్ ఐటీలో నిర్బంధ విద్య
- విద్యార్థుల మానసిక స్థితిని గుర్తించని అధికారులు
- మొక్కుబడిగా కౌన్సెలింగ్
- ఒంటరిగా ఫీల్ అవుతున్న విద్యార్థులు

భైంసా: నేరం చేసి శిక్ష పడిన ఖైదీలకు కూడా హక్కులు ఉంటాయని చట్టం చెబుతోంది. ఆ హక్కులకు భంగం కలిగించొద్దని న్యాయస్థానాలు సూచిస్తున్నాయి. ఖైదీల హక్కులను కాపాడాల్సిన బాధ్యత పోలీసులపై ఉంటుంది. బంధువులు, కుటుంబ సభ్యులతో ములాఖత్ కూడా ఉంటుంది. కానీ, చదువుల తల్లి శ్రీజ్ఞాన సరస్వతిదేవి సన్నిధిలో ఏర్పాటు చేసిన ట్రిపుల్ ఐటీ జైలు కన్నా కఠినంగా ఉందని అంటున్నారు అక్కడ చదువుతున్న విద్యార్థులు. అది వర్సిటీ కాదని జైలుకన్నా ఘోరంగా ఉందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. నిబంధనల పేరుతో విద్యార్థులను నిర్బంధిస్తున్నారని, వారి స్వేచ్ఛను హరిస్తున్నారని అభిప్రాయపడుతున్నారు. పిల్లలను కలుద్దామని వందల కిలోమీటర్ల దూరం నుంచి వచ్చే తల్లిదండ్రులు పిల్లలను చూడకుండానే వెనుదిరగాల్సిన పరిస్థితి. ఇక వర్సిటీలో విధించిన ఆంక్షలతో తాము ఖైదీల కన్నా అధ్వానంగా ఉంటున్నామంటున్నారు విద్యార్థులు. వీటిని భరించలేక విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొత్త ప్రభుత్వం కొలువుదీరాక పరిస్థితి మారుతుందని ఆశించినా ఎలాంటి మార్పు కనిపించడం లేదని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. తాజాగా సంగారెడ్డి జిల్లా మానూరు మండలం దువ్వూరు గ్రామానికి చెందిన తెనుగు శిరీష ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం కూడా అర్ధరాత్రి వరకు బయటకు తెలియనివ్వకుండా గోప్యత పాటించడం వర్సిటీలో ఆంక్షలు, నిబంధనల ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

భరోసా ఉంటుందని..
బిడ్డల భవిష్యత్తుకు భరోసాగా ఉంటుందనుకునే ప్రతిష్టాత్మక బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల ఆత్మహత్యలు కలవర పెడుతున్నాయి. తల్లిదండ్రులకు తీరని దుఃఖం మిగులుస్తోంది. వేలాది మంది ఉండే ఈ క్యాంపస్‌లో చదివే విద్యార్థులకు మనోధైర్యం ఇచ్చే వాళ్లు లేకపోవడంతో కొత్తగా వర్సిటీలో చేరిన విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని విద్యా నిపుణులు పేర్కొంటున్నారు. విద్యార్థుల మానసిక స్థితిని అర్థం చేసుకోవడం లేదని అభిప్రాయపడుతున్నారు. క్యాంపస్ ఆవరణలో, తరగతి గదుల్లో నీరసంగా, అసహనంగా, ఒంటరిగా ఉండే వారిని పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి మనోధైర్యం నింపితే ఆత్మహత్యలు ఆగుతాయని సూచిస్తున్నారు. ఇక చదువు పూర్తవుతున్న సమయంలోనూ ప్లేస్‌మెంట్ లేకపోవడం, కుటుంబ పరిస్థితులు, ఇతర వ్యసనాలు వారిని మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాయి. దీనిని తగ్గించేలా క్యాంపస్‌లో క్రీడలు, సంగీతంపై మక్కువపెంచేలా చూడాల్సి ఉన్నా అలాంటి చర్యలేవి లేవని తెలుస్తోంది. వారానికి ఒక్కరోజైనా విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో మానసిక ప్రశాంతతను పొందేలా ప్రేరేపించాలని తల్లిదండ్రులు సూచిస్తున్నారు. విద్యార్థులంతా ఒంటరిగా ఉండకుండా ఎవరితోనైనా తమ బాధలుచెప్పుకునేలా, మనసువిప్పి మాట్లాడుకునే పరిస్థితులు కల్పించాలని కోరుతున్నారు.

క్యాంపస్‌కు కొత్త...
బాసర ట్రిపుల్‌ఐటీలో చదివే విద్యార్థులంతా గ్రామీణస్థాయి నుంచి వచ్చినవారే. ఇక్కడికి వచ్చిన వారు రెండేళ్ల పీయూసీ కోర్సు చదవాలి. ఇంటర్మీడియెట్‌తో సమానమైన ఈ రెండేళ్ల కోర్సు చదివిన విద్యార్థులకు వచ్చిన మార్కులు, ప్రతిభ ఆధారంగా ఇంజినీరింగ్‌లో సీట్లు కేటాయిస్తారు. పీయూసీ-1, పీయూసీ-2 ఉత్తీర్ణత తర్వాతే విద్యార్థులు ఇంజినీరింగ్‌లో ఏ కోర్సు చదవాలనే విషయంపై స్పష్టత వస్తుంది. పదో తరగతి వరకు నిత్యం ఉదయం బడికి వెళ్లి సాయంత్రం ఇంటికి వెళ్లేవారు. ట్రిపుల్‌ఐటీలో వచ్చే సరికి నిబంధనలు ఉంటాయి. బయటకు వెళ్లలేని పరిస్థితి. తల్లిదండ్రులను లోనికి రానివ్వరు. కొత్తగా చేరిన వారితోనే స్నేహం, బంధుత్వం కలుపుకుని కలిసిపోవాలి. హాస్టళ్లలో చదివిన వారికి ఇది అలవాటుగా ఉంటుంది. నిత్యం వెళ్లి వచ్చేవారికి కొత్తగా, భయంగా ఉంటుంది. మానసిక ఒత్తిడి పెరుగుతుంది. రుచి, పచిలేని ఆహారం కూడా పిల్లలకు తరచూ ఇంటిని గుర్తు చేస్తుంది.

అనుమానాస్పద మరణాలు..
బాసర ట్రిపుల్ ఐటీలో 2023, డిసెంబర్‌లో జాదవ్ బబ్లూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 2022 డిసెంబర్‌లో ఓ విద్యార్థి చనిపోగా 2023 జూన్‌లో ఒక్కరోజు వ్యవధిలో ఇద్దరు విద్యార్థులు చనిపోయారు. 2023 జూన్ 13న బలవన్మరణానికి పాల్పడిన సంగారెడ్డికి చెందిన వడ్ల దీపిక(17) మృతిపై ఎన్నో ప్రశ్నలు ఉన్నాయి. అదేరోజు నలుగురు సభ్యుల నిజనిర్ధారణ కమిటీ వేసినా ఇప్పటికీ కారణాలు బయటపెట్టలేదు. జూన్ 14 అర్ధరాత్రి తర్వాత గంగా బ్లాక్ నాలుగో అంతస్తుపై నుంచి పడి చనిపోయిన లిఖిత మరణంపై ఎలాంటి అనుమానాలు లేవని కుటుంబసభ్యులు, వర్సిటీ వర్గాలు చెబుతున్నా.. ఏదో మిస్టరీ ఉందన్న వాదనలూ బలంగా ఉన్నాయి. రాత్రి 2.30 గంటల సమయంలో లిఖిత బయటకు ఎందుకు వచ్చిందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఆమె మరణంపై సెక్యూరిటీ గార్డులు, అధికారులు చెప్పిన వివరణలు వేర్వేరుగా ఉండటం గమనార్హం.

సెత్వారిపై ప్రజావాణిలో ఫిర్యాదు

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో 45 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సెత్వారీ భూముల సమస్య పరిష్కరించాలని వీడీసీ సభ్యులు, గ్రామస్తులు హైదరాబాద్ ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ముంపునకుగురైనా ఇప్పటికీ తమ గ్రామ భూములకు సెత్వారి కాలేదని తెలిపారు. సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని నోడల్ అధికారి హామీ ఇచ్చినట్లు వీడీసీ సభ్యులు తెలిపారు. ఫిర్యాదు చేసినవారిలో వీడీసీ చైర్మన్ రెమ్మాయి సాగర్, కోశాధికారి కొండ రవి, మాజీ సర్పంచ్ రోడ్డ రాజేశ్వర్, గొడుగు భూమేశ్ ఉన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు..

లక్ష్యం చేరేనా?

- మహిళా సంఘాలకు పూర్తిస్థాయిలో అందని రుణం
- పూర్తి కావస్తున్న ఆర్థిక సంవత్సరం

భైంసాటౌన్: పట్టణాల్లోని మహిళలు స్వయం ఉపాధి పొందడం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలన్న ఉద్దేశంతో స్వయం సహక సంఘాల మహిళలకు మెప్మా ఆధ్వర్యంలో వడ్డీ లేని రుణాలు అందిస్తోంది. రుణాలు పొంది క్రమం తప్పకుండా చెల్లించిన సంఘాలకు తిరిగి కొత్త రుణాలు అందిస్తూ ఆర్థికంగా చేయూతనందిస్తోంది. ఏటా మెప్మా అధికారులకు రుణ లక్ష్యం విధిస్తూ బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు మంజూరు చేస్తోంది.

ఈ ఏడాది లక్ష్యం రూ.32.65 లక్షలు..
2023-24 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలోని మూడు మున్సిపాలిటీలకు కలిపి 512 స్వయం సహాయక సంఘాలకు రూ.32.65 లక్షల రుణాలు అందించాలని లక్ష్యం విధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరో నెల రోజుల్లో ముగియనుంది. రుణాల పరంగా లక్ష్యం చేరుకున్నా.. సంఘాల లక్ష్యం చేరుకోలేదు. 512 సంఘాలకుగాను ఇప్పటి వరకు 312 సంఘాలకు మాత్రమే రుణాలందించారు. గడువులోగా మిగిలిన సంఘాలకు రుణాలు అందించాలని సంఘాల సభ్యులు కోరుతున్నారు.

మున్సిపాలిటీల వారీగా...
జిల్లా కేంద్రమైన నిర్మల్‌తోపాటు భైంసా, ఖానాపూర్ పట్టణాల్లో మెప్మా ఆధ్వర్యంలో రుణ లక్ష్యం నిర్ణయించారు. నిర్మల్ పట్టణంలో 322 సంఘాలకు రూ.17.99 కోట్ల రుణం లక్ష్యం విధించగా, 219 సంఘాలకు రూ.24.14 కోట్లు రుణాలు అందించారు. రుణపరంగా లక్ష్యాన్ని మించినా, సంఘాల లక్ష్యం నెరవేరలేదు. భైంసా పట్టణంలో 115 సంఘాలకు రూ.8.40 కోట్లు లక్ష్యం విధించగా, 76 సంఘాలకు రూ.6.97 కోట్లు రుణం అందించారు. ఖానాపూర్‌లో 75 సంఘాలకు రూ.6.25 కోట్ల లక్ష్యానికిగాను, 58 సంఘాలకు రూ.5.23 కోట్ల రుణ లక్ష్యం చేరుకున్నారు. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో లక్ష్యం మేరకు రుణాలు అందించాలని సభ్యులు కోరుతున్నారు.

లక్ష్యం చేరుకుంటాం...
2023-24 ఆర్థిక సంవత్సరానికి మహిళా సంఘాలకు లక్ష్యం మేరకు బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తున్నాం. ఇప్పటి వరకు 312 సంఘాలకు రుణాలు మంజూరు చేశాం. మిగిలిన సంఘాలకు గడువులోగా రుణాల మంజూరు పూర్తి చేస్తాం.
– సుభాష్, మెప్మా పీడీ, నిర్మల్

2023-24 రుణ లక్ష్యం ఇలా(రూ.లక్షల్లో...)

మున్సిపల్	లక్ష్యం		మంజూరు		శాతం
	సంఘాలు	రుణం	సంఘాలు	రుణం	
నిర్మల్	322	1799.7	219	2414.56	134.16
భైంసా	115	840.00	76	697.00	82.98
ఖానాపూర్	75	625.80	58	523.50	86.65
మొత్తం	512	3265.5	312	3635.06	111.32

‘పీఎం విశ్వకర్మ’కు దరఖాస్తు చేసుకోవాలి



పీఎం విశ్వకర్మ యోజన అవగాహన కార్యక్రమానికి హాజరైన చేతివృత్తి కులస్తులు

- అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకానికి అర్హులైన కులవృత్తుల వారు దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్ సూచించారు. స్థానిక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం కింద 5 శాతం వడ్డీకి రుణం పొందవచ్చని తెలిపారు. సబ్సిడీ సైతం ఉంటుందన్నారు. వివిధ కుల వృత్తులు చేసుకునే వారికి శిక్షణ, మార్కెటింగ్ తోపాటు, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఇదివరకే కులవృత్తి చేసుకునేవారు వారి వృత్తిలో నిరంతరం కొనసాగడమే కాకుండా వారి నైపుణ్యాలు ఇంకా పెంపొందించుకోవచ్చన్నారు. 18 రకాల చేతివృత్తుల దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కుటుంబంలో ఒకరు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. లబ్ధిదారులు మీసేవ కేంద్రాలు, గ్రామ, వార్డు పంచాయతీల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుకు ఎటువంటి రుసుము ఉండదని, పథకంలో మొదటి విడతగా రూ.లక్ష రుణం మంజూరు చేస్తారని తెలిపారు. రుణం మొత్తం 18 నెలల్లో చెల్లిస్తే రెండో విడతలో రూ.2 లక్షల రుణం మంజూరవుతుందని వివరించారు. ఈ మొత్తాన్ని 30 నెలల్లో చెల్లించాలని తెలిపారు. లబ్ధిదారులకు ప్రాథమిక శిక్షణలో భాగంగా గుర్తించబడిన నైపుణ్య కేంద్రాల్లో వారం రోజులు శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. శిక్షణ కాలంలో రోజుకు రూ.500 చొప్పున స్టైఫండ్ అందిస్తారన్నారు. ఎంఎస్ఎంఈ డీఎఫ్‌వో నవీన్ కుమార్, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ నర్సింహారెడ్డి, ఎల్‌డీఎం చంద్రశేఖర్, పీడీ మెప్మా సుభాష్, అధికారులు, చేతివృత్తుల వారు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

పట్టుకోండి చూద్దాం..!



భైంసా పట్టణం నడిబొడ్డున బస్టాండ్ ప్రాంతం. ఎదురుగా ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి. ఎప్పుడూ పోలీసు పికెటింగ్ ఉంటుంది. పోలీస్‌స్టేషన్‌లోని కమాండ్ కంట్రోల్‌రూంకు అనుసంధానమైన సీసీ కెమెరాలు ఉన్నాయి. అయినా ఆస్పత్రి ఆవరణలో నిలిపి ఉంచిన ద్విచక్రవాహనం ఇటీవల చోరీ అయింది. ఓ దుండగుడు వాహనం తాళం పగులగొట్టి బస్టాండ్ రోడ్డు మీదుగా వాహనం తోసుకుంటూ వెళ్లాడు. ఈ దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి.

- భైంసా పోలీసులకు దొంగల సవాల్
- వరుస చోరీలతో జనం బెంబేలు
- మట్కా దందా, జూదం నిర్వహణ
- విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు, వినియోగం
- నిఘా పెంచితేనే నేరాలకు అడ్డుకట్ట





చోరీ అయిన రెండు ద్విచక్రవాహనాల ముందు, వెనుక టైర్లు

ఇటీవలి కొన్ని సంఘటనలు...
- పట్టణ శివారులోని శివాజీనగర్‌లో ధనోరే బాలాజీకి చెందిన రెండు ఆవులను మంగళవారం రాత్రి ఇంటి ఆవరణలో ఉన్న పాక నుంచి దొంగలు ఎత్తుకెళ్లారు.
- మూడు రోజుల క్రితం పట్టణంలోని బ్రాహ్మణగల్లి, గుజిరిగల్లిలో ఇళ్ల ముందు నిలిపి ఉంచిన ద్విచక్రవాహనాల ముందు, వెనుక టైర్లు చోరీ అయ్యాయి.
- స్థానిక బైల్‌బజార్‌లో రాజేందర్‌కు చెందిన ఎడ్లబండి నిలిపి ఉంచగా, దాని రెండు ఇనుప చక్రాలను దొంగలు ఎత్తుకెళ్లారు.
- పదినెలల క్రితం పట్టణంలోని వారసంతలో ఓ వ్యక్తి కూరగాయల కోసం వచ్చి రూ.500 నకిలీ నోటు ఇచ్చాడు. దానిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.



పట్టణంలోని భైంసా-బాసర రహదారిలో గడ్డెన్నవాగు ప్రాజెక్టు కాలువ పక్కన గల ఓ హార్డ్‌వేర్ దుకాణంలో గురువారం రాత్రి దొంగలు గ్యాస్ కట్టర్‌తో వెనుకవైపు షట్టర్ తాళం తొలగించారు. లోనికి ప్రవేశించి దుకాణంలో ఉన్న లాకర్ ఎత్తుకెళ్లారు.ఈ దొంగతనానికి వారం రోజుల ముందు సైతం దుకాణం వెనుకవైపు కిటికీ తొలగించి లోనికి ప్రవేశించి సీసీ కెమెరాల డీవీఆర్ ఎత్తుకెళ్లారని, వారంరోజులకు మళ్లీ వెనుకవైపు షట్టర్ పగులగొట్టి లాకర్ ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు.

భైంసాటౌన్: పట్టణంలో దొంగలు రెచ్చిపోతున్నారు. వరుస చోరీలతో పోలీసులకే సవాల్ విసురుతున్నారు. పోలీసుల నిఘా వైఫల్యం కారణంగా వరుస చోరీలు జరుగుతున్నాయని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. పట్టణం నడిబొడ్డున గంజ్ ప్రాంతంలో, శివారుకాలనీలు, పార్డి(బి) బైపాస్‌రోడ్ ప్రాంతంలో యువత విచ్చలవిడిగా గంజాయి వినియోగిస్తోంది. ఇటీవల స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమీపంలో ముగ్గురు యువకులు గంజాయి సేవిస్తుండగా, పోలీసులు గుర్తించారు. మట్కా, జూదం, బెట్టింగ్ దందా సైతం గుట్టుగా సాగుతోంది. వీటి బారినపడి అప్పులపాలైన కొంతమంది ఆత్మహత్య చేసుకున్న సందర్భాలున్నాయి. గతంలో పట్టణంలో ఎన్ఐఏ సైతం సోదాలు జరిపి ఇద్దరిని అదుపులోకి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. పట్టణంలో నేరాలు పెరుగుతున్నా ముందస్తుగా గుర్తించి అరికట్టడంలో పోలీసులు విఫలమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.


నిఘా ఉన్నా...
సున్నిత ప్రాంతంగా పేరొందిన భైంసా పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పట్టణ శివారులో టీఎస్ఎస్పీ రెండో బెటాలియన్ ఏర్పాటు చేశారు. రెండు కంపెనీల బలగాలు అందుబాటులో ఉంటున్నాయి. దీంతోపాటు పట్టణంలోని ప్రధాన ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాల్లోని సీసీ కెమెరాలు పట్టణ పోలీస్ స్టేషన్‌లోని కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానమై ఉన్నాయి. బస్టాండ్, ఏరియాస్పత్రితోపాటు సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతరం పోలీసు గస్తీ ఉంటుంది. అయినా నేరాలకు అడ్డుకట్ట పడకపోవడం, తరచూ చోరీలు జరగడం నిఘా వైఫల్యమేనన్న ఆరోపణలు వస్తున్నాయి. పోలీసులు గస్తీ పెంచి నేరాలకు అడ్డుకట్ట వేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు...
పట్టణంలో నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. సీసీ కెమెరాల ఆధారంగా నేరస్తులను గుర్తిస్తున్నాం. ప్రజలు కూడా ఏదైనా ఘటన జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. పరస్పర సహకారంతోనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుంది.
– డి.రాజారెడ్డి, పట్టణ సీఐ, భైంసా

27న స్వర్ణోత్సవ సభ

భైంసాటౌన్: తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ స్వర్ణోత్సవ సభ ఈనెల 27న పట్టణంలోని కేఎస్ గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.హరిత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యశివాజీ తెలిపారు. శుక్రవారం పట్టణంలో మాట్లాడారు. ఈ సభకు ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు బి.ప్రదీప్, ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, హాజరవుతారని వెల్లడించారు. బీడీ కార్మికులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సునారికారి రాజేశ్, ఆర్.మహేందర్, బి.రాజవ్వ, లక్ష్మి పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

కుంటాల: ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. మండలంలోని కల్లూర్ వాసవి కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కుపై శుక్రవారం అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఓటు దేశ అభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు సాయిలు, గట్టుపల్లి శ్రీనివాస్, డైరెక్టర్లు జానకిరాం, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిల్లా జైలును సందర్శించిన డీజీ సౌమ్య


పుష్పగుచ్ఛం ఇస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా శుక్రవారం జిల్లా జైలును సందర్శించారు. ఆమె జిల్లాకు వచ్చిన సందర్భంగా ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. వర్టికల్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, జిల్లా జైలు సూపరింటెండెంట్ అశోక్ కుమార్, పట్టణ సీఐలు కె.సత్యనారాయణ, అశోక్, అదనపు డీజీతో పాటు జైలు శాఖ ఐజీ మురళీబాబు, వరంగల్ రేంజ్ డీజీపీ సంపత్ కుమార్ సైతం స్వాగతం పలికారు.

షార్ట్ సర్క్యూట్‌తో గడ్డి దగ్ధం


మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

కడెం: మండలంలోని నవబ్‌పేట్ గ్రామంలో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రాపెల్లి సతీశ్‌కు చెందిన గడ్డివాము దగ్ధమైంది. వివరాల ప్రకారం... సతీశ్‌కు చెందిన గడ్డివాముపై ఉన్న స్తంభం వద్ద షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి 90 గడ్డికట్టలు, సెంట్రింగ్ కర్రలు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.50వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. అలాగే గుమ్ముల భూమన్న ఇల్లు సైతం పాక్షికంగా దగ్ధమైంది. ఖానాపూర్ నుంచి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

అమృత్ పథకంలో బాసర రైల్వేస్టేషన్


బాసర రైల్వే స్టేషన్

భైంసా: చదువుల తల్లి నిలయమైన బాసరలోని రైల్వే స్టేషన్ అమృత్ భారత్ పథకంలో ఎంపిక చేసినట్లు హైదరాబాద్ డివిజన్ సీనియర్ మేనేజర్ వి. విద్యాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి మోడీ ఈనెల 26న వర్చువల్ విధానంలో 500 స్టేషన్లను ఈ పథకం కింద శిలాఫలకం వేయనున్నారు. ఆదిలాబాద్ పార్లమెంటు పరిధిలోని బాసర రైల్వేస్టేషన్‌ను ఎంపీ సోయంబాపురావు ప్రారంభించనున్నట్లు సమాచారం. దీంతో బాసర స్టేషన్ రూపురేఖలు పూర్తిస్థాయిలో మారనున్నాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

భైంసారూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలైన సంఘటన మండలంలోని వానల్‌పాడ్ గ్రామ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం... నిర్మల్ నుంచి అభిలాశ్, ఆనంద్ అనే యువకులు ద్విచక్రవాహనంపై భైంసాకు వస్తున్నారు. వానల్‌పాడ్ సమీపంలో వంతెనకు బైక్ ఢీకొట్టగా అభిలాశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆనంద్‌కు స్వల్ప గాయాలు కావడంతో స్థానికులు వారిని 108లో భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్య సేవల కోసం అభిలాశ్‌ను నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు.


పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు


పూనకాలతో శివసత్తులు

జయహో.. గజ్జలమ్మ

- బోనమెత్తిన ఆడపడుచులు
- ముగిసిన వార్షికోత్సవ వేడుకలు

కుంటాల: జయహో గజ్జలమ్మ.. జైజై గజ్జలమ్మ నామస్మరణతో కుంటాల శుక్రవారం మారుమోగింది. ఆలయ 4వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. ఉదయం నిత్యనిధి, మహాపూర్ణ హారతి, కుంభాభిషేకం వంటి కార్యక్రమాలు వేద పండితుడు గురుమంచి చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆడపడుచులు బోనాలతో అమ్మవారి ఆలయానికి చేరుకొని ప్రత్యేకంగా తయారు చేసిన బురెలు, పాయసం అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉపాధ్యాయుడు దాండేవార్ శాంతాబాయి – సాహెబ్‌రావు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ముధోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్, ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ జుట్టు అశోక్, రిటైర్డ్ ఆర్డీవో గజ్జన్న, భైంసా కోర్ట్ ఏపీపీ అరుణ, సీఐ శ్రీనివాస్, ఎస్సై హన్మాండ్లు, మాజీ ఎంపీపీలు బోజారాం పటేల్, రాంచందర్‌రెడ్డి, ఓం ప్రకాష్ లడ్డా పూజలు చేశారు.


బోనాలతో ఆలయానికి వస్తున్న మహిళలు


పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నారాయణరావు

నేడు అక్కకొండ జాతర

- లక్ష్మీనరసింహా స్వామి రథోత్సవం


కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

కడెం: మండలంలోని దిల్దానగర్ సమీపంలోని అక్కకొండ లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సామూహిక కుంకుమార్చనలు, అభిషేకం, మంగళశాసనం, మూలమంత్ర హావనం, బలిహారణ పూజ కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు వొద్దిపర్తి వెంకటరమణాచార్యులు తెలిపారు. శనివారం లక్ష్మీనరసింహా రథోత్సవం, జాతర కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు జగ్గరావు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాజారమేశ్‌గౌడ్, తెలిపారు.

రీలొకేషన్ ఎప్పుడో?

- తుది దశకు పునరావాస గ్రామాల పనులు
- తరలింపుపై నిర్ణయం తీసుకోని అటవీశాఖ


అధికారులతో మాట్లాడుతున్న పీసీసీఎఫ్ దోబ్రియల్


రీలొకేషన్ కాలనీలో నిర్మించిన ఇళ్లు

కడెం: కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ కోర్ ఏరియాలోని రాంపూర్, మైసంపేట్ గ్రామాల తరలింపు ప్రక్రియ తుది దశకు చేరింది. రాంపూర్, మైసంపేట్ గ్రామాలను ఖాళీ చేయించి, మండలంలోని కొత్త మద్దిపడగ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న విలేజ్ రీలొకేషన్-1కు తరలించనున్నారు. రీలొకేషన్ సైట్‌లో ఇళ్ల నిర్మాణాలు, పెత్తర్పు సమీపంలో వ్యవసాయ భూమిని ఆదివారం పీసీసీఎఫ్ ఆర్ఎం .డోబ్రియల్, ఎఫ్డీపీటీ శాంతరాం పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయించాలని అటవీ అధికారులను ఆదేశించారు.

రూ.11 కోట్ల వ్యయంతో కాలనీ..

మండలంలోని రాంపూర్, మైసంపేట్ గ్రామాల్లో 142 కుటుంబాలుండగా 94 మందికి ఇళ్లు, మండలంలోని పెత్తర్పు వద్ద 2 ఎకరాల, 32 గుంటల వ్యవసాయ భూమి అందజేయనున్నారు. 48 మందికి పునరావాస ప్యాకేజీ-2 కింద రూ.15 లక్షల చొప్పున అందిస్తారు. కొత్త మద్దిపడగ సమీపంలో రూ.11కోట్లు వెచ్చించి 94ఇళ్ల నిర్మాణం చేపట్టారు.

నాణ్యతపై అసంతృప్తి

కొత్తమద్దిపడగ గ్రామ సమీపంలో నిర్మించిన పునరావాస కాలనీలో డ్రెయినేజీలు, రోడ్లు, టాయిలెట్లు నాసిరకంగా నిర్మించారని రాంపూర్, మైసంపేట్ వాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 8న రీలొకేషన్ సైట్ విజిట్‌కు వచ్చిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఆయన వాహనాన్ని అడ్డుకున్నారు. కానీ, కలెక్టర్ తమ సమస్యపై స్పందించలేదని రెండు గ్రామాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. తడోబాలో కల్పించిన విధంగా తమకు పునరావాసం కల్పిస్తామని చెప్పిన అటవీ అధికారులు మాట తప్పారని అంటున్నారు. అన్ని సౌకర్యాలు కల్పిస్తేనే ఇక్కడకు వస్తామని స్పష్టం చేస్తున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



గ్రామాలను తరలిస్తామని అటవీ అధికారులు మమ్మల్ని తడోబా టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పునరావాస కాలనీకి తీసుకెళ్లారు. ఇక్కడలా కాలనీ నిర్మిస్తామని తెలిపారు. కానీ అప్పుడు చెప్పిన విధంగా ఇక్కడి పనులు లేవు. ఇలా అయితే గ్రామాన్ని ఖాళీ చేయం.

– గాదె బుచ్చవ్వ, రాంపూర్

తుది దశకు పనులు..



రీలొకేషన్ కాలనీ పనులు తుది దశకు చేరాయి, పెండింగ్ పనులు త్వరలోనే పూర్తి చేయిస్తాం. రీలొకేషన్‌లో భాగంగా ఇవ్వనున్న వ్యవసాయ భూముల హద్దులు ఏర్పాటు చేయించాం. గ్రామాల తరలింపుపై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

– అనిత, ఎఫ్ఆర్వో, కడెం

రైతులు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలి

- మహిళ అభివృద్ధి సంస్థ(ఏపీమాస్) డైరెక్టర్ మురళి


రైతులతో మాట్లాడుతున్న మురళి

లోకేశ్వరం: రైతులు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని మహిళా అభివృద్ధి సంస్థ(ఏపీమాస్) డైరెక్టర్ ట్రెయినింగ్ మురళి అన్నారు. మండలంలోని ధర్మోర గ్రామంలో లోకేశ్వరం మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ నుంచి సబ్సిడీపై అందజేసిన పసుపు ఉడికించే మిషన్‌ను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో మహిళా ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సంఘాల ద్వారా రైతులు ఎరువులు, పురుగు మందులను సంఘం నిర్ణయించిన ధరలకు పొందవచ్చని తెలిపారు. మండల రైతులకు అందుబాటులో ఉండేందుకు రెండు పసుపు ఉడకబెట్టే యంత్రాలు అందించామని పేర్కొన్నారు. వివిధ పంటలపై రైతులకు సూచనలు చేశారు. ఆయన వెంట జిల్లా మహిళా అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు మేనేజర్ రాజేశ్వర్, రైతులు ఉన్నారు.

రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వేదిక ప్రతినిధులు

కైలాస్‌నగర్: ఈ నెల 25న జరిగే తెలంగాణ రచయితల వేదిక 8వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉదారి నారాయణ, జిల్లా అధ్యక్షుడు బాలసాని నారాయణ గౌడ్ కోరారు. శుక్రవారం ఆ మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో తెలంగాణ రచయితల వేదిక కీలక పాత్ర పోషించిందన్నారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 10.30గంటలకు ప్రారంభమయ్యే ఈ మహాసభలకు సుప్రీంకోర్టు రిటైర్డు జడ్జీ బి.సుదర్శన్ రెడ్డి, ప్రముఖ కవి అందెశ్రీ, ఆంధ్రజ్యోతి సంపాదకులు శ్రీనివాస్, జయధీర్ తిరుమల్‌రావు, జూకంటి జగన్నాథం ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లుగా తెలిపారు. జిల్లాలోని కవులు, రచయితలు, కళాకారులు అధికసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

చివరిచూపు కోసం 24 రోజులు..

- ఎనిమిది నెలల క్రితం వివాహం
- గల్ఫ్ వెళ్లిన నాలుగు నెలలకే..
- గల్ఫ్‌లో బ్రెయిన్ స్ట్రోక్‌తో మండలవాసి మృత్యువాత


వెంకటేశ్ (ఫైల్)


నివాళులర్పిస్తున్న గల్ఫ్ అసోసియేషన్ నాయకులు

జన్నారం: ఉన్న ఊరిని.. కట్టుకున్న భార్యను.. కనిపెంచిన తల్లిదండ్రులను వదిలి ఉపాధి కోసం గల్ఫ్ బాట పట్టిన యువకుడు శవమై తిరిగొచ్చాడు. బ్రేన్ స్ట్రోక్‌తో 24 రోజుల క్రితం మృతిచెందగా అప్పటి నుంచి చివరి చూపు కోసం కుటుంబీకులు ఎదురుచూస్తున్నారు. జన్నారం మండలం దేవునిగూడ గ్రామానికి చెందిన కునారపు వెంకటేశ్(24) ఎనిమిది నెలల క్రితం వివాహం చేసుకున్నాడు. ఉన్న ఊరిలో ఉపాధి లేక ఆరు నెలల క్రితం ఏజెంట్‌కు డబ్బులు పెట్టి ఇరాక్ దేశంలోని ఇబ్రహిల్ పట్టణానికి వెళ్లాడు. విధులు నిర్వహిస్తుండగా జనవరి 30న బ్రేన్ స్ట్రోక్ వచ్చింది. వెంటనే కంపెనీ సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అప్పటి నుంచి భర్త మృతదేహం కోసం కంటిలో నీరు కడుపులో దాచుకుని భార్య ఎదురుచూస్తోంది. శుక్రవారం పెట్టెలో భర్త మృతదేహం స్వగ్రామానికి రావడంతో భార్య రోదన ఎవరు ఆపలేకపోయారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు కల్లెడ భూమన్న, వర్కింగ్ ప్రసిడెంట్ తిరుపతి, సంఘం నాయకులు ఎల్లయ్య, కునారపు భీమరాజు మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా అప్పుల పాలైనా వెంకటేశ్ కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. మృతదేహం స్వగ్రామం రావడానికి సహకరించిన ఎమిగ్రేట్ అసోసియేషన్ అధ్యక్షుడు మంద భీంరెడ్డి, అంబులెన్స్ ఏర్పాటు చేసిన తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

ప్రాణం పోసిన సీపీఆర్


భైంసా ఆసుపత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

భైంసారూరల్: నిర్మల్ జిల్లా కుభీర్ మండలం చాతా గ్రామానికి చెందిన వాడేకర్ విఠల్ శుక్రవారం గుండెపోటుతో ఇంట్లో కుప్పకూలిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108కు సమాచారం అందించారు. అయితే పరిస్థితి విషమిస్తుండడంతో కారులో భైంసా ఆస్పత్రికి తీసుకువస్తున్నారు. మార్గమధ్యలో గుండేగాం వద్ద అంబులెన్సు ఎదురు కావడంతో కారు ఆపి విఠల్‌ను అంబులెన్స్‌లోకి మార్చారు. పరిస్థితి విషమించడంతో ఈఎంటీ పూజారి లక్ష్మణ్, పైలెట్ ఖాజామోయినొద్దీన్ అతడికి సీపీఆర్ చేసి పల్స్ అందేలా చూశారు. అనంతరం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. సీపీఆర్ చేసి పల్స్ అందించిన సిబ్బందిని పలువురు అభినందించారు.

మద్యం మత్తులో కిందపడి ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్: మద్యం మత్తులో కిందపడి ఒకరు మృతిచెందిన ఘటన జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. టూటౌన్ ఎస్సై వెంకటరమణ రెడ్డి ప్రకారం.. జైనథ్ మండలం గూడ గ్రామానికి చెందిన పొట్ట దేవిదాస్ (40) కొన్ని రోజులుగా మద్యానికి బానిస కావడంతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కాగా గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని బస్టాండ్ సమీపంలో కింద పడిపోవడంతో స్థానికులు అంబులెన్స్‌లో రిమ్స్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య ఉమా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుండె పోటుతో బీటెక్ విద్యార్థిని మృతి


నార్వాడే హాసిని

నర్సాపూర్(జి): మండలంలోని బామిని(బి) గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థిని గుండెపోటుతో మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాల మేరకు... మండలంలోని బామిని(బి) గ్రామానికి చెందిన నార్వాడే హాసిని(18) హైదరాబాద్‌లో బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. ఆరోగ్యం బాగలేకపోవడంతో ఇటీవల ఇంటికి వచ్చేసింది. గురువారం రాత్రి గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు నిర్మల్ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు అర్ధరాత్రి మృతిచెందింది. తండ్రి నార్వాడే వెంకట్‌రావు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. కూతురు మరణించడంతో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

గోదావరిలో మునిగి ఒకరి మృతి

భైంసా: బాసర గోదావరి నదిలో శుక్రవారం స్నానానికి దిగి ప్రమాదవశాత్తు సురేశ్(50) నీటిలో మునిగి మృతిచెందాడు. నిజామాబాద్ జిల్లాకు చెందిన సురేశ్ బాసరకు వచ్చాడు. తన మనువడి పుట్టెంట్రుకలు తీసే కార్యాన్ని బాసరలో నిర్వహించారు. బాసరకు వచ్చిన ఆయన కుటుంబీకులతో కలిసి గోదావరి నది తీరానికి వచ్చాడు. నదిలో స్నానం ఆచరించేందుకు దిగి ప్రమాదవశాత్తు అదే నీటిలో మునిగి మృతిచెందాడు. అక్కడే ఉన్న జాలర్లు మృతదేహాన్ని బయటకు తీశారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బాసర ఎస్సై గణేశ్ తెలిపారు.

పురుగుల మందుతాగి ఒకరి ఆత్మహత్య


సంతోష్ (ఫైల్)

సోన్: మద్యానికి బానిసై ఒకరు పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... అల్లకొండ సంతోష్(47) నాలుగు నెలల క్రితం కూతురి వివాహం చేశాడు. అప్పటి నుంచి ఎలాంటి పని చేయకుండా మద్యానికి బానిసయ్యాడు. మద్యం మానేయాలని భార్య మందలించడంతో మనస్తాపానికి గురైన సంతోష్ పురుగుల మందుతాగాడు. అపస్మారకస్థితిలోకి వెళ్లిన సంతోష్‌ను కుటుంబ సభ్యులు వెంటనే నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోష రవీందర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


గాయాలపాలైన సత్యం సాయన్న

భైంసారూరల్: భైంసా – నిర్మల్ జాతీయ రహదారిపై శుక్రవారం తిమ్మాపూర్ గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన సత్యం సాయన్న, ఉంబిరి సాయన్న ద్విచక్ర వాహనంపై కల్లూరు నుంచి తిమ్మాపూర్‌కు వెళ్తున్నారు. అదే క్రమంలో నిర్మల్ వైపు నుంచి భైంసా వైపునకు వస్తున్న కారు ఢీకొట్టింది. ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను 108 అంబులెన్సులో భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు.

తనిఖీలకు వచ్చిన అధికారులు..

- అందుబాటులో లేని రైస్‌మిల్లు యాజమాన్యం
- శనివారం తనిఖీలు నిర్వహించేందుకు మిల్లుకు తాళం


రైస్‌మిల్లు గేటుకు తాళం వేస్తున్న రెవెన్యూ సిబ్బంది

సిర్పూర్(టి): మండలంలోని వెంకట్రావ్‌పేట్ గ్రామ సమీపంలోని బాలాజీ రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహించేందుకు శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రాగా రైస్‌మిల్లులో యాజమాన్యం అందుబాటులో లేకుండా మిల్లుకు తాళం వేసి ఉండడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వెనుతిరిగారు. ఈ సందర్భంగా తాళం వేసి ఉన్న రైస్‌మిల్లు సీల్‌వేసి చేశారు. అలాగే రైస్‌మిల్లు గేటుకు తాళాలు వేసి వెళ్లారు. రైస్ మిల్లు తనిఖీలు శనివారం కొనసాగిస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాస్ తెలిపారు. తనిఖీల్లో ఇన్‌చార్జి తహసీల్దార్ బక్కయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, రాజ్‌కుమార్, శ్యాంలాల్ ఉన్నారు.

తూకం వేశాకే సరఫరా చేయాలి


సూచనలిస్తున్న శ్యామలాదేవి

జైనథ్: ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జీలు రేషన్ బియ్యాన్ని తూకం వేశాకే షాపులకు సరఫరా చేయాలని అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను డీఎస్వో కిరణ్‌కుమార్‌తో కలిసి సందర్శించారు. బియ్యం నిల్వలు, సరఫరా లాంటి అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లీగల్ మెట్రాలజీ స్టాంపింగ్‌తో కూడిన ఎలక్ట్రానిక్ కాంటాలు అన్ని ఎంఎల్ఎస్ పాయింట్లకు అందించడం జరిగిందన్నారు. వాటి ద్వారా 50కిలోల చొప్పున బియ్యాన్ని తూకం వేసి తరుగు రాకుండా డీలర్లకు అందించాలన్నారు. అలాగే ఒకసారి ఉపయోగించిన మంచి గన్నీబ్యాగ్‌లో మాత్రమే బియ్యాన్ని రైస్‌మిల్లర్ల నుంచి తీసుకోవాలని సూచించారు. డీలర్లకూ మంచి గన్నీ బ్యాగ్‌లలో మాత్రమే బియ్యాన్ని సరఫరా చేయాలని ఆదేశించారు. భారత్ బ్రాండ్ రైస్‌ను విక్రయాలు చేపట్టే అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. తహసీల్దార్ మహేందర్‌రెడ్డి తదితరులున్నారు.